ప్రజాశక్తి
సోమవారం 12 ఆగస్టు 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు





నీరుగారుతున్న ఆశలు

- ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పదవులపై కూటమి ప్రభావం
- అధికార పార్టీ నేతల్లో పెరుగుతున్న అయోమయం
- అయినా ఎవరి ప్రయత్నాల్లో వారు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి



నామినేటెడ్ పదవులపై ఎంతో ఆశలు పెట్టుకున్న టిడిపి నాయకులకు నిరాశే ఎదురవుతోంది. తాజాగా పార్టీ అధిష్టానం తీసుకున్న కొన్ని విధానపరమైన నిర్ణయాల వల్ల సీనియర్లు, పార్టీకి 30 ఏళ్లకు పైగా సేవలు అందిస్తున్న నేతలకు ప్రాధాన్యం కలిగిన పదవులు దక్కుతాయన్న ఆశలు క్రమంగా సన్నగిల్లు తున్నాయి. 2024 ఎన్నికల్లో జనసేన, బిజెపిలో పొత్తు వల్ల పోటీ చేసే అవకాశాలు కోల్పోయిన పార్టీ ఇన్‌ఛార్జిలకు, టిక్కెట్లు దక్కక పోవడం వల్ల టిడిపి నుంచి పోటీ చేయలేకపోయిన నాయకులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. వీరితో పాటు ఇతర పార్టీల నుంచి టిడిపిలో చేరి పోటీ చేసే అవకాశం రాని వారికి కూడా పదవులు ఎంత వరకు వస్తాయన్నదీ ప్రశ్నగా మిగిలింది.

మొత్తం నామినేటెడ్ పదవుల్లో టిడిపి 60 శాతం, జనసేనకు 30, బిజెపికి 10 శాతం ఇస్తారన్న ప్రచారం కూడా టిడిపి నేతల ఆశలపై నీళ్లు చల్లినట్టు అయింది. నామినేటెడ్ పోస్టులతో పాటు ఎమ్మెల్సీ పదవులపై పలువురు ఆశలు పెట్టుకున్నారు. పొత్తుల వల్ల అవకాశం కోల్పోయిన వారికి, వేర్వేరు కారణాల వల్ల పోటీకి అవకాశం దక్కని వారికి ఎమ్మెల్సీలుగా అవకాశం ఇస్తామని చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. టిడిపి నుంచి మాజీ ఎమ్మెల్యేలు కొమ్మాలపాటి శ్రీధర్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, వైసిపి నుంచి టిడిపిలో చేరిన జంగా కృష్ణమూర్తి ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్నారు. 2025 మార్చిలో ఎమ్మెల్సీ స్థానాలకు ఖాళీలు రానున్నాయని అప్పటి వరకు వేచి ఉండాలని అధిష్టానం సూచించింది. పెదకూరపాడులో టిక్కెట్ దక్కని కొమ్మాలపాటి శ్రీధర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తానని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలోనే నేరుగా హామీ ఇచ్చారు. తెనాలి నుంచి జనసేన పొత్తు వల్ల టిక్కెట్ దక్కని ఆలపాటికి తగిన ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. టిడిపిలో చేరడం వల్ల ఏడాది ముందే జంగా ఎమ్మెల్సీ పదవిని కోల్పోయారు. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద ఆయనపై మండలి చైర్మన్ అనర్హత వేటు వేశారు. దీంతో ఆయన ఏడాది ముందే ఎమ్మెల్సీ స్థానం కోల్పోయారు. గత ఏడాది ఎమ్మెల్సీ ఎన్నికలప్పుడు టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనూరాధ విజయానికి సహకరించిన తాడికొండ మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. టిడిపి నాయకులు వై.వి.ఆంజనేయులు, నాగమల్లేశ్వరరావు, కోడెల శివరాం, కోవెలమూడి రవీంద్ర, డేగల ప్రభాకర్, మన్నవ మోహన్ కృష్ణ, దాసరి రాజా మాస్టారు, నిమ్మల శేషయ్య, పిల్లి మాణిక్యారావు, నందం అబద్ధయ్య, అన్నాబత్తుని జయలక్ష్మీ, మానం విజేత, జనసేన నుంచి బోనబోయిన శ్రీనివాసయాదవ్, ఆళ్ల హరి, కల్యాణం శ్రీనివాసరావు, నాయబ్ కమాల్, గాదె వెంకటేశ్వరరావు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. టిడిపిలో ఇంకా అనేక మంది సీనియర్లు, మాజీ మంత్రులు చాలా కాలంగా ఎటువంటి అవకాశాలు రాక మౌనంగా ఉంటున్నారు. కనీసం రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ అయినా కావాలని ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.



సాగర్‌కు తగ్గిన నీటి ప్రవాహం

8 గేట్ల ద్వారానే నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఎగువ నుండి వరద ప్రవాహం తగు ముఖం పట్టడంతో నాగార్జునసాగర్ నుండి దిగువకు నీటి విడుదలను తగ్గించారు. ప్రాజెక్టు 8 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 63,288 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రెండ్రోజుల నుండి 26 గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల ఆదివారం ఉదయానికి ఎగువ నుండి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో క్రమంగా క్రస్ట్ గేట్లను తగ్గించుకుంటు ఆదివారం సాయంత్రానికి 8 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుండి 1,86,535 క్యూసెక్కుల నీరు సాగర్ జలాశయానికి చేరుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 588.20 అడుగులవద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 306.6922 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,841 క్యూసెక్కుల నీటిని, కుడి కాల్వ ద్వారా 741 క్యూసెక్కులను, ఎడమ కాల్వ ద్వారా 8454 క్యూసెక్కులను, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కులను, లోలేవల్ కెనాల్ ద్వారా 300 క్యూసెక్కులను, మొత్తం 1,04,424 క్యూసెక్కుల దిగువకు విడుదల చేస్తున్నారు.

పర్యాటకులతో రద్దీగా మారిన సాగర తీరం

పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. నాగార్జున సాగర్ డ్యాం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండడం, ఆదివారం సెలవు కావడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు నాగార్జున సాగర్ డ్యాంకు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకుల రాకపోకలు సాగాయి. సాగర్ గేట్ల ద్వారా జాలువారే నీటిని వీక్షిస్తున్నారు. అనంతరం శాంతిసిరి, నాగసిరి లాంచీల్లో నాగార్జున కొండకు తరలివెళ్లారు. రిజర్వాయర్ గేట్ల నుంచి వదులుతున్న కృష్ణమ్మ అందాలను చూస్తూ పర్యాటకులు పరవశిస్తున్నారు. అయితే నాగార్జునసాగర్‌లో పోలీసులు ఆంక్షలు విధించారు. ప్రధాన డ్యామ్, పవర్ హౌస్ పరిసరాల్లోకి పర్యాటకులు వెళ్లకుండా విజయపుసౌత్ ఎస్సై పట్టాభిరామ్ కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు.



పరీక్షలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ

సర్వే ఉద్యోగులకు పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సర్వేవిభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు వివిధ అంశాలపై ఆదివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగం కార్యాలయంలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షలను జిల్లా జాయింట్ కలెక్టరు భార్గవ తేజ పరిశీలించారు. వివిధ జిల్లాల నుంచి 1093 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 943 మంది హాజరయ్యారు. జూనియర్ అసిస్టెంట్, విఆర్‌వోలుగా పనిచేస్తున్న వారికి జూనియర్ సర్వేలుగా ప్రమోషన్ కల్పించేందుకు 42 రోజుల పాటు సామర్లకోట శిక్షణా కేంద్రంలో శిక్షణిచ్చిన అనంతరం శాఖపరమైన రాత పరీక్షను నిర్వహించారు. సామర్లకోట జాయింట్ డైరక్టర్ సిహెచ్.వి.ఎస్.ఎన్.కుమార్ పర్యవేక్షణలో ఈ పరీక్షకు జిల్లా మైనార్టీ కార్పొరేషన్ అధికారి షేక్ మహబూబ్ షరీఫ్ పరిశీలకులుగా వ్యవహరించారు. సర్వేశాఖ జిల్లా సహాయ సంచాలకులు వై.నాగశేఖర్, అకాడమి సహాయ సంచాలకులు ఎం.వి.రంగ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు ఆశాజనకం

- ఎరువుల కొరత లేదు
- నెలాఖరుల కల్లా వరి నాట్లు పూర్తి
- ముమ్మరంగా పత్తి, శనగ,అపరాల సాగు
- మిర్చిపై రైతులు అనాసక్తత
- ప్రజాశక్తితో వ్యవసాయశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు

5లో

శరవేగంగా క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం

5లో



రక్తదానం చేస్తున్న కార్మికులు, నాయకులు

సిఐటియు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా ప్రభుత్వ సమగ్ర అసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు గుంటూరు నగర పశ్చిమ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ సిఐటియు కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించటంతో పాటు, అనేక సామాజిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్తనిల్వలు లేకపోవటం వల్ల ఇబ్బందులు రాకుండా ఉండేందుకు రక్తదాన శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, నగర నాయకులు షేక్ మస్తాన్‌వలి, పూనేపల్లి శ్రీనివాసరావు, షేక్.ఖాసింవలి, డి.కోటేశ్వరరావు, వై.ప్రభుదాసు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పుట్టినరోజు వారోత్సవాలు సత్తెనపల్లి పట్టణంలో ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా స్థానిక రఘురాంనగర్ లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని తెలుగుదేశం పార్టీ మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, టిడిపి నాయకులు మన్నెం మల్లి బాబు,దరువురి నాగేశ్వరరావు, డాక్టర్ పవన్ లు ప్రారంభించారు. పట్టణ, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన ప్రజలకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

అడ్మిన్ సెక్రెటరీలకు ప్రమోషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

రేషనలైజేషన్‌లో భాగంగా, తమ సేవలను గుర్తించి, సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ ఇవ్వాలని ఎపి స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీస్ అసోసియేషన్ నాయకులు అరుణ్‌కుమార్, వీరాంజనేయులు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం తీసుకొచ్చిన రేషనలైజేషన్‌ను తమ అసోసియేషన్ స్వాగతిస్తుందని చెప్పారు. గత ఐదు సంవత్సరాలుగా కేటాయించిన విధులు పరిపాలన సెక్రెటరీలు సమర్ధవంతంగా నిర్వహిస్తున్నామని, కావున రేషనలైజేషన్‌లో భాగంగా తమకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వార్డు సచివాలయాలపై తీసుకోబోయే నిర్ణయాలలో కేటగిరీ-1 పరీక్షల్లో అత్యధిక మార్కులు తెచ్చుకున్న వార్డు పరిపాలన కార్యదర్శులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

అంతరించిపోతున్న ఆటలను ప్రోత్సహిద్దాం : ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అంతరించిపోతున్న ఆటలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ అన్నారు. స్థానిక బిఆర్ స్టేడియంలో సెలబస్టిక్ ఫేసింగ్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో 14వ సిలిబం స్టేట్ చాంపియన్ షిప్ పోటీల్లో బహుమతి ప్రదానోత్సవ సభ జరిగింది. గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు మెడల్స్ బహుకరించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అంతరించిపోతున్న క్రీడలను వెలుగులో తెచ్చి వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కర్రసాము విద్య నేర్చుకోవడం వల్ల బాల బాలికలకు ఆత్మ రక్షణ కలుగుతుందని ఈ విద్యను బాల బాలికలకు ప్రతి స్కూల్లో నేర్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు. కొత్త క్రీడలు రావడంతో పిల్లలు పాత క్రీడలను మర్చిపోయారని ప్రాచీన కాలంలో కర్ర సాముతో బ్రిటిషు వారిని భారతీయులు తరిమి కొట్టేవారని, భారతీయుల కర్ర సామును చూసి భయపడి బ్రిటిషర్లు కర్ర సామును నిషేధించారని తెలిపారు. పాత రోజుల్లో ఆత్మ రక్షణ కోసం కర్ర సామును ప్రతి ఒక్కరూ నేర్చుకునే వాళ్లన్నారు. మళ్లీ ఇప్పుడు పిల్లలకు కర్ర సాము పై ఉత్సాహం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ నరసింహారెడ్డి, సెలబస్టిక్ ఫేసింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కష్ణ ఫర్, 10వ వార్డ్ కార్పొరేటర్ మీరావలి, కలాం, ఏడు కొండలు, డి అశోక్ బాబు, కె.శంకర్, జి కోటేశ్వరరావు, రాము పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్



అత్యవసర చికిత్స విభాగంలో స్ట్రెచర్‌పై ఉన్న రోగి వద్ద సూపరింటెండెంట్ డాక్టర్ వై. కిరణ్‌కుమార్

జిజిహెచ్‌లో తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిని సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అత్యవసర చికిత్స విభాగాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రెండు మూడు గంటల నుంచి స్ట్రెచర్ పై బాధ పడుతున్న రోగికి అందుబాటులో ఉన్న పడక పైకి చేర్చారు. స్ట్రెచర్ పై ఎక్కువ సేపు ఉండకుండా వెంటనే పడకను అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆపస్మరకా స్థితి లో ఉన్న రోగిని చూసి వెంటనే ఊపిరి అందేవిధంగా చర్యలు తీసుకున్నారు..

జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం ప్రమాణ స్వీకారోత్సవం

ప్రజాశక్తి-తెనాలి

జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం రాత్రి స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. తొలుత మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ తో కలిసి మనోహర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అధ్యక్షులుగా కొప్పురావూరి కిషోర్, కార్యదర్శిగా సింగంశెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా గ్రంధి సీతారాం, గౌరవాధ్యక్షులుగా కర్పూరపు రఘునాథమూర్తి, అదనపు ప్రధాన కార్యదర్శిగా నాళం వీర వెంకట సాయి యుక్తేష్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు.



బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

బుద్ధదేవ్ భట్టాచార్యకు సిపిఎం ఘన నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం నేత బుద్ధదేవ్ భట్టాచార్య సంతాప సభ కుంచనపల్లి నటరాజ కళా మందిరం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు ఎ.రంగారావు పూలమాలవేసి నివాళులర్పించారు.

సిపిఎం మండల కార్యదర్శి డి.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ 11 ఏళ్లపాటు సిఎంగా పశ్చిమబెంగాల్ అభివృద్ధికి బుద్ధదేవ్ భట్టాచార్య ఎంతో కృషి చేశారన్నారు. సుపరిపాలన అందించడమే కాకుండా పేద, బడుగు బలహీన వర్గాల పోరాటాలకు సారధ్యం వహించారని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేశారని, పారిశ్రామిక రంగాన్ని ముందుకు తీసుకువెళ్లారని అన్నారు. పేదలకు భూములు పంపిణీ చేశారని, విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేశారని, ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. పెట్టుబడిదారీ విధానాలకు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడడమే బుద్ధదేవ్ భట్టాచార్యకు ఇచ్చే నివాళని అన్నారు. కార్యక్రమంలో ఎ.రామారావు, ఎస్.రవికిషోర్, ఎ.సాంబిరెడ్డి, బి.శ్రీనివాసరావు, ఎ.అర్జున్‌రావు, ఎ.శివ పాల్గొన్నారు.

మూత్ర వ్యవస్థ సమస్యలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్ ఎంవి సత్యనారాయణ గుప్తా పాల్గొని ప్రోస్టేట్ గ్రంధి, మూత్ర సంబంధిత వ్యాధులు, చికిత్స విధానాలను వివరించారు. సభలో డాక్టర్ గుప్తా మాట్లాడుతూ మూత్ర సంబంధిత వ్యాధులు ప్రజలు అవగాహన కలిగి ఉండటం ముఖ్యంగా మన శరీరంలో ఆహారం ద్వారా గానీ, నీటి ద్వారా గానీ ప్రవేశించిన మలినాలను ఫిల్టర్ చేసి మూత్రం ద్వారా బయటకు పంపటానికి మూత్రపిండాలు పని చేస్తాయన్నారు. మూత్రపిండాలు సరిగా పనిచేయకపోతే శరీరంలోని రక్తంలో మలినాలు పెరిగి, ఆమలినాలు ఉన్న రక్తం శరీరంలోని వివిధ అవయవాలకు వెళ్లడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. సుమారు 11 నుంచి 14 సెంటీమీటర్ల పొడవు, 5 నుంచి 6 సెంటీమీటర్ల వెడల్పు కలిగి చిక్కుడు గింజ ఆకారంలో ఉండే ఈ మూత్రపిండాలు , మన అవయవాలలో ఒక ముఖ్యమైన అవయవం అని తెలిపారు. సాధారణంగా ఒక మనిషికి రెండు మూత్రపిండాలు ఉంటాయని, వాటిలో ఒకటి పూర్తిస్థాయిలో పనిచేసినా మనిషి ఆరోగ్యకరంగా జీవించడానికి అవకాశం ఉంటుందన్నారు. మధుమేహం కలిగిన వారిలో ఈ మూత్రపిండాలు శరీరంలో చక్కెర శాతాన్ని నియంత్రణ చేసి బయటకు మూత్రం ద్వారా పంపే క్రమంలో ఒక్కొక్కసారి మూత్రపిండాలు దెబ్బతింటాయని వివరించారు. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం గురించి వివరిస్తూ, మనం తీసుకునే ఆహారం వల్ల, తక్కువ ద్రవ పదార్థాలు తీసుకోవడం వల్ల, ఎక్కువ సమయం మూత్ర విసర్జన చేయకుండా నియంత్రించడం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడుతున్నాయన్నారు. సాధారణంగా కిడ్నీలో రాళ్లు ఉన్న వ్యక్తులు వంకాయ, టమాట, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, పాలకూర, మాంసాహారం, పుట్టగొడుగులు, ఉప్పు లాంటి పదార్థాలు డాక్టర్ సలహా మేరకు తీసుకోవాలి తెలిపారు. ప్రోస్టేట్ గ్రంధి పురుషులలో మాత్రమే ఉంటుందని సాధారణంగా 40 సంవత్సరాలు పైబడిన పురుషుల్లో ఈ గ్రంధి పరిమాణం కూడా పెరుగుతూ ఉంటుందనానరు. హార్మోన్ల బ్యాలెన్స్ లేకపోవటం, కొవ్వు కలిగిన ఆహార పదార్థాలు ఎక్కువగా తినడం వల్ల ఈ గ్రంధి పెరుగుదల జరుగుతుందని వివరించారు. ఈ గ్రంధి పెరుగుదల వలన మూత్ర విసర్జనలో ఏ విధమైన ఇబ్బందులు తలెత్తనంతవరకు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, ఒకవేళ మూత్ర విసర్జనలో సమస్యలు గమనిస్తే వెంటనే యూరాలజిస్ట్‌ను సంప్రదించి, తగిన చికిత్స తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అవగాహన సభ్యులు డాక్టర్ సత్యనారాయణ గుప్తాను ఘనంగా సత్కరించారు. సమావేశంలో టీ.వి సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, ఆరోగ్య ప్రచారకులు వి.వి.రావు, విశ్రాంత ప్రిన్సిపల్ ఆర్.కష్ణయ్య, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకులు కె.చంద్రశేఖరరావు ప్రసంగించారు.



మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ గుప్తా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కామేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మాచవరం గ్రామానికి చెందిన బచ్చు సీతారామయ్య బంధువైన మరో మహిళతో కలిసి మాచవరం గ్రామం నుండి ద్విచక్ర వాహనంపై పిడుగురాళ్ల వైపు వస్తుండగా పిడుగురాళ్ల నుండి హైదరాబాదు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో సీతారామయ్య(58) అక్కడికక్కడే మృతి చెందాడు. మహిళకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా చేరుకుని పరిశీలించారు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి-దుగ్గిరాల

ద్విచక్రవాహన ప్రమాదంలో 108 వాహన ఇఎంటికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. దుగ్గిరాల సమీపంలోని మోరంపూడి గ్రామానికి చెందిన గోరికపూడి చిట్టి బాబు కొల్లిపర 108 వాహనంలో ఈఎంటిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఎదురుగా వస్తున్న ద్విక్రవాహనం తనను ఢీకొంది. దీంతో ఈఎంటి గోరికపూడి చిట్టిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. ఢీకొన్ని ఇద్దరు. యువకులు వారి ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. దుగ్గిరాల 108 సిబ్బంది క్షతగాత్రుని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇతని పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు తెలిసింది.

గుర్రంపై నుండి పడి ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి దుగ్గిరాల : గుర్రంపై నుండిపడి ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. దుగ్గిరాల గ్రామానికి చెందిన ఒక యువకుడు స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణంలోకి ఒక గుర్రాన్ని తీసుకొచ్చాడు. అతని ఇద్దరి స్నేహితులు ఆ గుర్రంపై ఎక్కి స్వారీ చేయటానికి ప్రయత్నించి కిందపడి గాయాల పాలయ్యారు. అదేవిధంగా తీసుకొచ్చిన యువకుడూ స్వారీ చేసి గాయాలపాలయ్యాడు. ఈ గుర్రపు స్వారీలు ఆదివారం సెలవురోజున పెచ్చుమీరుతున్నాయి..

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

ట్రాఫిక్ అంతరాయం కలిగించొద్దని మంగళగిరి మండలం చినకాకాని గ్రామ పరిధిలో గల ఎన్ఆర్ఐ జంక్షన్ వద్ద, ఎన్నారై హాస్పిటల్‌కి వెళ్లే దారి వద్ద రోడ్డుపై పడ్ల దుకాణాలను, బడ్డీ షాప్ వారికి ఎస్ఐ సిహెచ్ వెంకట్ సూచించారు. ఎన్నారై జంక్షన్ వద్ద ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇతరులకు ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని చెప్పారు.

10 లీటర్ల నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్లలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది పది లీటర్ల నాటుసారా అదివారం పట్టుకున్నారు. పట్టణంలో ప్రత్యేక దాడులు నిర్వహించారు. స్థానిక రింగ్‌రోడ్డు సెంటర్, బిఎస్ఎన్ఎల్ ఆఫీసు వద్ద వ్యక్తి మొగిలి వెంకయ్య నుంచి పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. వెంకయ్యది వెల్దుర్తి మండలం శిరిగిరిపాడుకు కాగా కొంతకాలంగా ప్రస్తుతం సుద్దగుంతల 1వలైన్‌లో ఉంటున్నారు. నిందితుడు మొగిలి వెంకయ్యను మాచర్ల మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా, 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడ్ని గురజాల సబ్ జైలు కు తరలించారు.

ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించొద్దు



ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి రోడ్డు మార్జిన్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు ఆటంకాలను కలిగించొద్దని పట్టణ సిఐ వినోద్ కుమార్ సూచించారు. గౌతమ బుద్ధ రోడ్డు, మెయిన్ బజార్లలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రహదారులపై ముందుకు వచ్చి కార్యకలాపాలు నిర్వహించే చిరు వ్యాపారులను మార్కింగ్ వెనుక తోపుడుబండ్లను పెట్టుకోవాలని సూచించారు. మెయిన్ బజార్‌లో దుకాణాల ఎదుట స్టాల్స్‌ను తొలగించాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ప్రతిరోజూ ప్రధాన రహదారుల్లో పర్యటిస్తామని, ఆక్రమణలను తొలగిస్తామని ఈ సందర్భంగా సిఐ వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్‌కు శంకుస్థాపన



ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బైపాస్‌రోడ్డుకు కొద్దిపాటి దూరంలో అమరావతి ఐకాన్ పక్కన ఉన్న ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టుకు ఆ సంస్థ మేనేజర్ దొంతిరెడ్డి సాంబిరెడ్డి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన, అధునాతన మోడల్‌లో విల్లా ప్రాజెక్టులు, అపార్టుమెంట్లు నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. నూతన ప్రభుత్వంలో రియల్ వ్యాపారం ఊపందుకుందన్నారు. తాడేపల్లి ప్రాంతంలోని ప్రజలకు అన్ని సౌకర్యాలతో గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులు నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 80 ప్లాట్లు పూర్తి చేయడానికి ప్లాన్ అప్రూవల్ అయ్యిందని పేర్కొన్నారు. ఆద్య, ఆనంద పేరుతో నిర్మించనున్న విల్లాలు, ప్లాట్లు అందరికీ అందుబాటులో అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మేనేజన్ పార్టనర్ చిరుమాళ్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

మాచర్లలో గోదావరి ఆంధ్ర కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్ ప్రారంభం

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలోని నెహ్రూనగర్‌లో గోదావరి ఆంధ్ర కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్ నూతన మాచర్ల బ్రాంచ్‌ను ఆది వారం మాచర్ల శాసనసభ్యులు జూల కంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. సొసైటి లిమిటెడ్ మేనేజర్ తమ్మినేని శ్రీనివాస రావు, సిబ్బంది ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి స్వాగతం పలికారు. అనంతరంరిబ్బన్ కట్ చేసి కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లా డుతూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించి, సొసైటి అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం విలేకరు లతో సొసైటి మేనేజర్ తమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మాచర్లలో ఏర్పాటు చేసిన నూతన బ్రాంచిను ప్రజలు ఆదరిం చాలని, హెడ్ ఆఫీస్ మంగళగిరిలో ఉందని, రాష్ట్ర వ్యాప్తంగా 16 బ్రాంచ్‌లను కలిగి ఉందని, దీనికి చైర్మన్ తాళ్ళపల్లి శ్రీనివాస్ అని చెప్పారు. అతి తక్కువ వడ్డీకి వ్యాపార రుణాలు అందిస్తా మన్నారు. 85 నెలల ఫిక్సడ్ డిపా జిట్లపై 16 శాతం వడ్డీ అంది స్తామని, ఈ పథకంలో లక్ష రూపా యలు డిపాజిట్ చేస్తే నెలకు 1333 రూపాయలు వడ్డీ వస్తుందన్నారు. 72 నెలలకు లక్ష రూపాయలు డిపాజిట్ చేస్తే రెండు లక్షలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.దుర్గారావు, కె.వెంకటేశ్వర్లు, పి.శ్రీను, రంగా సత్యం, కె.సైదయ్య, షేక్ అన్వర్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రోటరీ క్లబ్ కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్‌లోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తనయుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య ప్రారంభించారు. రోటరీ క్లబ్ హాఫ్ నరసరావుపేట ,పెదకాకాని శంకర్ నేత్రాలయం వారి సంయుక్త నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ అంధత్వ నివారణ సంస్థ సహకారంతో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక పరీక్షలు అనంతరం వారి తీవ్రత మేరకు కొంత మందికి ఉచితంగా మందులు, అవసరమైన వారికి ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. కార్యక్రమాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రయివేటు డిగ్రీ కళాశాల అసోసియేషన్ అధ్యక్షులు వాగ్దేవి కళాశాలల కరస్పాండెంట్ ఆర్.శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు కె.రాజేంద్రప్రసాద్, కోశాధికారి కె.ఆంజనేయులు తదితరులు పర్యవేక్షించారు.

వరికపూడిశెల ప్రాజెక్ట్ పనులు ప్రారంభించండి

నిర్మాణానికి అనుమతులిచ్చి నిధులు కేటాయించాలి ● సాగు, తాగునీరు ఈ ప్రాజెక్టుతోనే సాధ్యం : సిపిఎం

ప్రజాశక్తి - వినుకొండ

వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు కె.హనుమంత్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ అటవీ శాఖకు చెల్లించాల్సిన రూ.18 కోట్లను ప్రభుత్వం చెల్లించకుండా ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అప్పటి ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలు రైతుల పొలాల్లో ప్రాజెక్టు పనులు ప్రారంభించినట్లు నటించి రైతులను మోసం చేయడం శోచనీయమన్నారు. వైసిపి హయాంలో అటవీశాఖ, పర్యావరణ, పుణ్య ప్రాణుల సంరక్షణ శాఖల నుంచి అనుమతులు పూర్తిగా లభించనప్పటికీ వెల్దుర్తి మండలంలో మొదటి ఫేస్‌లో సుమారు 24 వేల ఎకరాల సాగు కోసం అనుమతులు వచ్చినట్లు ఆర్భాటంగా పనులు ప్రారంభించారు. వరిక పూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి రూ.3,500 కోట్లతో అంచనాలు కాగా రూ.1600 కోట్లు విధులు కేటాయించా లని అఖిలపక్షాలు, వరికపూడిశెల ప్రాజెక్ట్ సాధన కమిటీ డిమాండ్ చేసినప్పటికీ నాటి ప్రభుత్వం విడుదల చేయకపోగా అటవీ శాఖ రూ.18 కోట్లు కేటాయించడంలోనూ నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 60 రోజులకు పైగా గడిచినప్పటికీ గత అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్‌లో మొదటి విడతగా రూ.1600 కోట్లు కేటాయించాలని సిపిఎం కోరినప్పటికీ నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. కృష్ణానది జలాలతో పరీవాహ ప్రాంతాలు కళకళలాడుతున్నాయని, శ్రీశైలం నుండి 3.92 లక్షల క్యూసెక్కులు నీరు వస్తుండగా, 4.44 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుందన్నారు. సాగర్ జలా శయానికి 2.92 లక్షల క్యూసెక్కులు నీరు వస్తుండగా సాగర్ డ్యాం 26 గేట్లు ఎత్తి 2.76 లక్షల క్యూసెక్కు నీరు దిగువకు విడుదల చేస్తున్నారని చెప్పారు. సాగర్ నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 587.1 అడు గుల మేరకు నీటి సామర్థ్యం ఉందని, సముద్రంలో నీరు వృధాగా కలిసి పోతుం దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు ఇచ్చి నిధులు



మాట్లాడుతున్న కె.హనుమంత్‌రెడ్డి, బొంకూరి వెంకటేశ్వరరావు

కేటాయించి మాచర్ల, వినుకొండ, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల్లో 7 మండలాల్లోని తాగునీటి చెరువుల్లో నింపడం ద్వారా 1,20,000 ఎకరాలకు సాగునీరు, 120 గ్రామాలకు పైగా తాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు నిర్మాణంతోనే సాధ్యపడుతుందని అన్నారు. టిడిపి ప్రభుత్వం, ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు జీవి ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డిలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు వెంటనే నిధులు కేటా యించి పనులు ప్రారంభించాలని కోరారు.



వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ

పోపూరి రామారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - యడ్లపాడు

ప్రజలతో మమేకమై, వారిని చైతన్య పరచి, సమస్యలపై ఉద్యమించడమే పోపూరి రామారావుకు ఇచ్చే సరైన నివాళి అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులోని పిఆర్ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం, రైతు సంఘం సీనియర్ నాయకులు పోపూరి రామారావు 5వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు విగ్రహానికి దేవాదాయ శాఖ విశ్రాంత అధికారి పోపూరి గంగయ్య చౌదరి పూల మాలలేసి నివాళులర్పించారు. అనంతరం పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం, సిపిఎం నేత బుద్ధదేవ్ భట్టాచార్య, పోపూరి రామారావు చిత్రపటాల వద్ద నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. అనం తరం నిర్వహించిన సభకు సిపిఎం సీనియర్ నాయ కులు పోపూరి సుబ్బారావు అధ్యక్షత వహిం చారు. రాధాకృష్ణ మాట్లాడుతూ పోపూరి రామారావుతో 1985 నుండి కలిసి ఉద్యమంలో పాల్గొన్నాని, సమయ పాలన కచ్చితంగా పాటించేవారని, ఆయన ఉద్యమ స్ఫూర్తిని కమ్యూనిస్టులే కాకుండా ఇతరులు సైతం మెచ్చుకునేవారని చెప్పారు. పదిహేనేళ్ల వయ సులో కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చిన ఆయన తుది శ్వాస వరకూ నిజాయితీగా పని చేశారన్నారు. ఆయన ఆశయాలు, లక్ష్యాల సాధనకు కొత్తతరాన్ని వాటిపట్ల ఆకర్షిపంజేసి ఉద్యమాన్ని విస్తరించాల్సిన అవసరం ఉం దని చెప్పారు. పోపూరి సుబ్బారావు మాట్లాడుతూ చిన్నతనం నుండే మార్క్సిజం ఆలోచనలతో సమాజాన్ని మార్చాలని రామారావు తపన పడ్డారని, సామాజిక అంతరాలు, ఘర్షణల సందర్భంలో పేదల పక్షాన నిలబడ్డారని అన్నారు. పుడమి బిల్డర్స్ అధినేత ముత్తవరపు సురేష్ బాబు మాట్లాడుతూ రామారావు స్ఫూర్తితోనే విజ్ఞాన కేంద్ర నిర్మాణంలో తనవంతు కృషి చేశానని చెప్పారు. సుందరయ్య స్మారక కళోత్సవాల్లో తమను ఎంతో ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నారు. ప్రముఖ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ విలువలతో జీవించిన రామారావుకు నివాళిగా తన సంపాదనలో కొంత భాగాన్ని ఆయన పేరుమీద సమాజాన్ని చైతన్యపరచడానికి కేటాయిస్తున్నట్లు తెలిపారు. రైతు నాయకులు కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు ఉద్యమంలో రామారావు నాయకత్వంలో ఈ ప్రాంత ప్రజలు ఉద్యమించారని, ఆయన స్ఫూర్తితోనే తాను రైతు ఉద్యమాల్లోకి ప్రవేశించానని తెలిపారు. కార్యక్రమంలో పోపూరి రామారావు కుమార్తెలు చెరుకూరి అరుణ, మానుకొండ అనురాధ, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెచ్ఎం చెరుకూరి సృజన, సిపిఎం మండల కన్వీనర్ టి.కోటేశ్వరరావు, నాయకులు కె.రోశయ్య, ఎన్.తులశయ్య, కె.వెంకట్రావు, కె.రామారావు, ఎం.రామరావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పండరీ పురంలోని సిపిఎం కార్యాలయంలో పోపూరి రామారావుకు సీనియర్ నాయకులు బొల్లు శంకర్రావు, పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఆంజనేయ నాయక్ సిపిఎం పట్టణ కార్యదర్శి పేరు బోయిన వెంకటేశ్వర్లు పార్టీ సభ్యులు నివాళులర్పించారు. బొల్లు శంకరరావు మాట్లాడుతూ రామారావు ఒక విధంగా పార్టీకి ఇక్కడ నిర్మాణ కర్తగా చెప్పవచ్చు అన్నారు. అనంతరం పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టి.ప్రతాప్ రెడ్డి, ఎస్. లూథర్, ఎం.విల్సన్, ఎల్.ఐ.సి ఏ.ఓ.ఐ తరపున జి.వీరయ్య, ఎస్. వీర బ్రహ్మానందం పాల్గొన్నారు.

నేటి తరం రాజకీయ నాయకులకు
బుద్ధదేవ్ భట్టాచార్య ఆదర్శనీయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ఆదివారం బుద్ధదేవ్ భట్టాచార్య మతి పట్ల సంతాపం తెలిపారు. బుద్ధదేవ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ నేటి



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య.

తరం కమ్యూనిస్టులు ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. బుద్ధదేవ్ భౌతికకాయాన్ని పరిశోధన నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్ఆర్ఎస్ మెడికల్ కళాశాల హాస్పిటల్ కు అప్పగించడం గొప్ప విషయమన్నారు .సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ బుద్ధదేవ్ సిపిఎంలో నిర్ణయాధికార విభాగం పొలిట్ బ్యూరోలో కీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు. 2011లో జరిగిన ఎన్నికల్లో ఆయన నేతత్వంలోని ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడం వయోభారంతో క్రమంగా భట్టాచార్య ప్రజా జీవితానికి దూరమయ్యారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.శివకుమారి, టి. పెద్దిరాజు, కామినేని రామా రావు, మస్తాన్ వలి, ఆంజనేయ రాజు,సాయి, కట్టా కోటేశ్వరరావు, బి.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

18న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 18న మాచర్ల పట్టణంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆదివారం టిడిపి నాయకులు తెలిపారు. మాచర్ల నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉగ్యోగాలు కల్పించాలనే ఉద్ధేశంతో స్థానిక పిడబ్ల్యూడి కాలనీలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మెగా జాబ్ మేళా జరగ ంందన్నారు. వివరాలకు అక్కిరెడ్డి జూలకంటి 7207289996, షేక్ జానీ 9032447895 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శరవేగంగా క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం


- రూ.45 కోట్ల అంచనాతో జనవరిలో ప్రారంభమైన పనులు
- మొత్తంగా 400 పడకలకు చేరనున్న తెనాలి జిల్లా వైద్యశాల

ప్రజాశక్తి-తెనాలి

డెల్టా ప్రాంత ప్రజలకు వరమైన తెనాలి జిల్లా వైద్యశాల్లో మరో నూతన విభాగం అందుబాటులోకి రానుంది. అత్యవసర కేసులను గుంటూరు జిల్లా వైద్యశాలకు తరలిస్తున్న నేపథ్యంలో తెనాలిలోనే ఆ స్థాయిలో వైద్యం అందించేందుకు కసరత్తు జరుగుతోంది. రూ.45 కోట్ల అంచనాతో 100 పడకలతో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం ప్రారంభమైంది. భవన నిర్మాణం ఏడాదిన్నరలోగా పూర్తి చేయాల్సి ఉంది. మొత్తంగా 2025 చివరి నాటికి క్రిటికల్ కేర్ బ్లాక్ అందుబాటులోకి రానుంది.

తెనాలి జిల్లా వైద్యశాల డెల్టా ప్రాంతంలోనే అతి పెద్ద ప్రభుత్వ వైద్యశాలగా ఉంది. తెనాలి, కొల్లిపర, చుండూరు, అమృతలూరు, వేమూరు, కొల్లూరు, దుగ్గిరాల, కొల్లూరు, చేబ్రోలు, రేపల్లె మండలాల రోగులు ఉచిత వైద్యసేవలకు ఈ ఆసుపత్రినే ఆశ్రయిస్తారు. వైద్యశాలలో తల్లీపిల్లల వైద్య విభాగం, నియోనేటల్ కేర్ విభాగం, డయాలసిస్ విభాగం, టిబి యూనిట్, హెచ్ఐవి/ఎయిడ్స్ రోగులకోసం ఎఆర్‌టి సెంటర్‌తో పాటు కార్డియాలజి మినహా అన్ని విభాగాలు అందుబాటులో ఉన్నాయి. అయితే అత్యవసర కేసులను మాత్రం గుంటూరుకు సిఫార్సు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అ పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.





నిర్మాణంలో క్రిటికల్ కేర్ యూనిట్

దీనిలో భాగంగానే 100 పడకలతో క్రిటికల్ కేర్ యూనిట్ అందుబాటులోకి తేవాలని సంకల్పించింది. రూ.45 కోట్ల అంచనాతో ఈ ఏడాది జనవరిలో భవన నిర్మాణం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకం నిధుల ద్వారా నిర్మితమయ్యే ఈ భవనం ఎపిఎంఎస్ఐడిసి పర్యవేక్షణలో హైదరాబాద్‌కు చెందిన ఎలిగ్జర్ మెట్ ఫారం ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. జిప్లస్ త్రీ తరహాలో నిర్మితం కానుంది. భవన నిర్మాణానికి రూ.21 కోట్లు కాగా, మిగిలింది అత్యవసర చికిత్సకు సంబంధించి ఆధునిక వైద్యపరికరాలు సమకూర్చేందుకు కేటాయించారు. ఏడాదిన్నర కాల వ్యవధిలో భవనం సివిల్ వర్క్స్ పూర్తి కావాల్సి ఉండగా, మరో ఆరు నెలల వ్యవధిలో ఆధునిక మెడికల్ డివైజెస్ సమకూర్చేందుకు, తదితర పనులకు కేటాయించారు. మొత్తంగా వాస్తవ ప్రణాళిక ప్రకారం 2025 చివరి నాటికి తెనాలి జిల్లా వైద్యశాల్లో క్రిటికల్ కేర్ యూనిట్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే 200 పడకలతో ఆసుపత్రి ఉండగా, మరో 100 పడకలతో తల్లీపిల్లల వైద్యశాల ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా క్రిటికల్ కేర్ యూనిట్ 100 పడకలతో అందుబాటులోకి వస్తే మొత్తంగా 400 పడకల ఆసుపత్రి అవుతుంది.

కార్డియాలజి సేవలు అందుబాటులోకి రావాలి

తెనాలి జిల్లా వైద్యశాలకు దాదాపు 10 మండలాలకు చెందిన రోగులు వైద్య సేవల నిమిత్తం వస్తుంటారు. వైద్యశాలలో ఎంతో ప్రాధాన్యత కలిగిన కార్డియాలజీ విభాగం అందుబాటులో లేదు. ప్రస్తుతం ఉన్న విభాగాలు ఒక ఎత్తయితే, కార్డియాలజి విభాగం మరో ఎత్తు. ఎందుకంటే తెనాలి పట్టణంలో ప్రైవేటు వైద్యశాలల్లోనూ కార్డియాలజికి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులో లేవు. మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉన్నా గుండె సంబంధిత రోగులను మాత్రం గుంటూరు, విజయవాడకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్రిటికల్ కేర్ యూనిట్‌లోనైనా కార్డియాలజీ సేవలు అందుబాటులోకి తెస్తే రోగులకు మరింత మేలనే భావన ప్రజల్లో ఉంది.

ఖరీఫ్ సాగు ఆశాజనకం

- ఎరువుల కొరత లేదు
- నెలాఖరుల కల్లా వరి నాట్లు పూర్తి
- ముమ్మరంగా పత్తి, శనగ,అపరాల సాగు
- మిర్చిపై రైతులు అనాసక్తత
- ప్రజాశక్తితో వ్యవసాయశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు ఆశాజనకంగా ఉందని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్షాలు ఆశాజనకంగా ఉండటం, కాల్వలకు సమృద్ధిగా నీరు రావడం, పట్టిసీమ, సాగర్ నుంచి నీటి విడుదలతో ఇప్పటికే వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

వెదపద్ధతిలో సాగుకి వరి





జిల్లాలో వరిసాగు ఎలా ఉంది?

జిల్లాలో దాదాపు లక్షన్నర నుంచి లక్షా 60 వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది వర్షాలు బాగా ఉండటం, కాల్వలకు నీటి విడుదల కూడా నిర్ణీత సమాయానికి రావడం వల్ల నీటి ఎద్దడి లేదు. వరిసాగు చేస్తున్న రైతుల్లో 80 శాతం మంది వెదపద్ధతిలో, 20 శాతం మంది నాట్లు వేసే విధానం పాటిస్తున్నారు. వెదపద్ధతిలో ఖర్చు తక్కువని భావిస్తున్నారు. నీటి వినియోగం కూడా తక్కువగా ఉంటుంది. కొన్నేళ్లుగా వెదపద్ధతికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. సాగర్ ఆయకట్టు ప్రాంతంలోని తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని వివిధ మేజర్ల కింద వరి సాగుకు అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో కూడా కొంత సాగవుతోంది. ఇప్పటి వరకు 80 శాతం విస్తీర్ణంలో పైర్లు సాగయ్యాయి.

ముంపు సమస్య?

డెల్టా ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో అధిక వర్షాల వల్ల వెదపద్ధతిలోసాగు చేసిన వరి నీట మునిగిన మాట వాస్తవమే. ఈ గ్రామాల్లోని రైతులు తిరిగి నారు పోసుకుని నాట్లు వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అధిక వర్షాలు, పల్లపు ప్రాంతాల సమస్యల వల్ల నీట మునిగాయి. అప్పుడే సాగు చేసిన వరికి ఎక్కువ నష్టం జరిగింది.

పత్తిసాగు ఎలా ఉంది?

పత్తి సాగు ప్రస్తుతం బాగానేఉంది. 65 వేల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా కాగా ఇప్పటి వరకు 50 వేల ఎకరాల్లో వేశారు. మిగతా ప్రాంతాల్లో పత్తి వేయని వారు పొగాకు, శనగ తదితర పంటలు వేయడానికి సిద్ధపడుతున్నారు. గతేడాది మంచి ధరలు రావడం వల్ల పత్తి సాగు కూడా బాగానే జరుగుతుందని భావిస్తున్నాం.

మిర్చి సాగు పరిస్థితి ?

ఈ ఏడాది మిర్చి సాగు కొంత తగ్గవచ్చునని భావిస్తున్నాం. మిర్చి ధరలు తగ్గడం, ఖర్చులు పెరగడంతో రైతులు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు. ప్రధానంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై దృష్టి పెడుతున్నారు. కౌలు ధరలు పెరగడం, నిర్వహణ ఖర్చులు, చివరి దశలో నీటి ఎద్దడి సమస్యలతో రైతులు మిర్చి సాగుకు ఈ ఏడాది ఆసక్తి తగ్గిందని చెబుతున్నారు. జిల్లాలో మిర్చికి ప్రత్యామ్నాయంగా పొగాకు, శనగ, పత్తి, ఇతర పంటల వైపు చూస్తున్నారు.

ఎరువులు, విత్తనాల కొరత ఉందా?

ఎరువుల కొరత లేదు. ప్రస్తుతానికి చాలినన్ని నిల్వలు ఉన్నాయి. 15 వేల టన్నుల యూరియా, 4 వేల టన్నుల డిఎపి ఎరువులు ఉన్నాయి. ఇతర కాంప్లెక్సు ఎరువులు సిద్ధంగానే ఉన్నాయి. వరి, పత్తి సాగు దాదాపుగా చివరి దశకు వచ్చింది. మిర్చి సాగుకు రైతులు అంతగా ఆసక్తి చూపకపోవడం వల్ల విత్తనాలకు డిమాండ్ లేదు. నారు విక్రయాలకు కూడా డిమాండ్ తగ్గింది. అందువల్ల ప్రస్తుతం విత్తనాలకు సంబంధించి సమస్యలేమీ లేవు.

ప్రజాశకి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్కేటింగ్‌లోహశిష్‌కు సిల్వర్ మెడల్

ప్రజాశక్తిద - తాడేపల్లి



తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్ సమీపంలోని పొలాచీలో ఈనెల 7 నుంచి 11 వరకు జరిగిన జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలలో తాడేపల్లి డోలాస్ నగర్‌కు చెందిన మెరుగుపాల హశిష్ రెండో స్థానం సాధించి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. అండర్-14 జూనియర్ విభాగంలో హశిష్ ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. ఆర్టిస్టిక్ స్కేటింగ్ విభాగంలో ఆరు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో హశిష్ సిల్వర్ మెడల్ సాధించారు. విద్యార్థి హశిష్ కుంచనపల్లి అరవింద సీబీఎస్ఈలో 8వ తరగతి చదువుతుండగా కోచ్ సత్యనారాయణ, స్కూలు యాజమాన్యం అభినందించారు.



ప్రముఖ కవి అనిల్ డ్యానీకి పితృ వియోగం

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రముఖ కవి, సాహితీ రంగంలో జాషువా సాంస్కృతిక వేదిక తదితర అభ్యుదయ వేదికల్లో పని చేస్తున్న అనిల్‌డ్యానీ తండ్రి అబ్రహాం (73) ఆదివారం ఉదయం మృతిచెందారు. రాయనపాడు రైల్వే వర్కుషాపులో పని చేసి విశ్రాంత ఉద్యోగిగా ఎన్‌టిఆర్ జిల్లా కొండపల్లిలో ఉంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అబ్రహాం భౌతికకాయాన్ని తాడేపల్లి తీసుకొచ్చి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. భౌతికకాయాన్ని సాహితీ స్రవంతి నుంచి సత్యరంజన్, విశ్వేశ్వరరావు, సాహితీ మిత్రులు మురళీ, ప్రజాశక్తి ఉప సంపాదకులు ఒలేటి శాంతిశ్రీ, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి, ఉపాధ్యక్షులు ఎస్.అనిల్, గాదె సుబ్బారెడ్డి, బాలోత్సవాల రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

పానకం కాంట్రాక్ట్ రద్దు

ప్రజాశక్తి-మంగళగిరి

స్థానిక పానకాల నరసింహస్వామి పానకం కాంట్రాక్ట్ రద్దుచేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. పానకం నాణ్యతగా ఇవ్వడం లేదని, ఖాళీ వాటర్ బాటిల్ ధర రూ.20కు అమ్ముతున్నారని, పూజా సామగ్రి ధరలూ అధికంగా వసూలు చేస్తున్నట్లు సందర్శకుల నుండి ఫిర్యాదులు రావడంతో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి విచారణ చేపట్టారు. నివేదికను దేవదాయ శాఖ కమిషనర్‌కు అందించడంతో కాంట్రాక్ట్ రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అయితే కాంట్రాక్ట్ నిర్వాహకుడు నోటీస్ తీసుకోవడం లేదని ఈవో తెలిపారు. ఈ మేరకు కాంట్రాక్టర్ మంతనాలు జరుపుతున్నట్లుగా తెలిసింది.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కేరళ రాష్ట్రంలో వయనాడ్ వరద బాధితులకు ప్రధాన మంత్రి మోడీ ఆర్థిక సహాయం ప్రకటించకపోవడం దుర్మార్గమని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి విమర్శించారు. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) పిలుపుమేరకు వరద బాధితులకు ఆదివారం రైతుసంఘం, సిఐటియు సంయుక్తంగా విరాళాలు సేకరించాయి. శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కేరళ రాష్ట్రం వయనాడ్‌లో వరద భీభత్సానికి వందలాదిమంది ప్రాణాలు కోల్పోతే ప్రధానమంత్రి వచ్చి విహంగ వీక్షణం చేశారేగాని మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయాన్ని ప్రకటించలేదని అన్నారు. బాధిత కుటుంబాలకు అండగా తమవంతు ఆర్థిక సహాయాన్ని అందించిన మండలంలోని గుడివాడ గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.బాబూప్రసాద్, హుస్సేన్‌వలి, ఎన్.రాజ్యలక్ష్మి, ఎం.సాంబశివరావు, జె.కోటేశ్వరరావు, బి.సుధాకర్ పాల్గొన్నారు.



మాచర్ల రూరల్ సిఐగా షేక్ నఫీజ్ బాష

ప్రజాశక్తి-విజయపురిసౌత్



మాచర్ల రూరల్ సిఐగా షేక్ నఫీజ్ భాష ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు విధుల్లో ఉన్న సురేష్ గిద్దలూరుకు బదిలీ అయ్యారు. కందుకూరులో విధులు నిర్వహిస్తున్న నఫీజ్ భాష ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సిఐ నఫీజ్ భాష మాట్లాడుతూ గ్రామాల్లో నిషేధిత గుట్కా, మట్కా, జూదం, నాటుసారా వంటివాటిని అరికట్టాలన్నారు. దీనిపై కఠినచర్యలు ఉంటాయన్నారు. చట్టపరమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈయన గతంలో చిలకలూరిపేట సిఐగా పని చేశారు.

నూతన ఎస్ఐలు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - నాదెండ్ల



నాదెండ్ల ఎస్సైగా జి.పుల్లారావు ఉద్యోగ బాధ్యతలను ఆదివారం స్వీకరించారు. ఆయన గతంలో చిలకలూరిపేట పట్టణంలో బాధ్యతలు నిర్వర్తించారు. బదిలీపై మండలానికి వచ్చారు. గత ఎస్ఐ బలరామిరెడ్డిని పల్నాడు సిసిఎస్‌కు బదిలీ అయ్యారు.

ప్రజాశక్తి - యడ్లపాడు



యడ్లపాడు నూతన ఎస్ఐగా వంకాయలపాటి బాలకృష్ణ ఉద్యోగబాధ్యతలను ఆదివారం స్వీకరించారు. గతంలో ఈయన చిలకలూరిపేట రూరల్‌ఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటివరకు విధులు నిర్వర్తించిన ఎస్ఐ శామ్యూల్‌రాజీవ్‌కుమార్ సత్తెనపల్లికి బదిలీ అయ్యారు.

ప్రజాశక్తి-నకరికల్లు



మండల నూతన ఎస్సైగా సిహెచ్. సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో దాచేపల్లి, రెంటచింతల, శావల్యాపురం, మండలాల్లో పనిచేసి సాధారణ బదిలీలో భాగంగా నకరికల్లుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీ పడేది లేదన్నారు.

నర్సరీ, బయో ప్లాంటేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సత్తెనపల్లి నియోజకవర్గం మాదల గ్రామంలో ఏర్పాటు చేసిన రవితేజ బయోప్లాంటేషన్ నర్సరీని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం ప్రారంభించారు. ప్రతిఒక్కరూ మొక్కల పెంపకంపై ఆసక్తిగా ఉండాలన్నారు. బయోప్లాంటేషన్ విషయంలో శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతో ఉందని, యజమాని కిషోర్ లాంటి వ్యక్తులు గుర్తు చేస్తున్నారని అన్నారు. ప్రతిఇంట్లోనూ మొక్కల పెంపకం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కపలవాయి విజయ్‌కుమార్, జనసేన నాయకులు రమాదేవి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సొసైటీ సభ్యులు ఈ-కెవైసి చేయించాలి

ప్రజాశక్తి-నకరికల్లు

నకరికల్లు సొసైటీ కార్యాలయంలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరూ ఈ-కెవైసి చేయించుకోవాలని సొసైటీ సిఇఓ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటరీకరణ నిమిత్తం తప్పకుండా ప్రతిరైతూ ఆధార్‌కార్డు, పాన్ కార్డు, జిరాక్స్‌లను, రెండు పాస్‌ఫోట్ సైజ్ ఫోటోలను ఫోన్ నెంబర్‌లను అందజేయాలని పేర్కొన్నారు.

పూడిపోతున్న వాగులు - పట్టని అధికారులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మనిషికి నీరు చాలా అవసరం. ఆ నీటి కోసం పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. అలాంటి నీటి పారుదల కోసం ఏర్పడినవే వాగులు, వంకలు. ఆ వాగులను కాపాడుకోవాల్సిన అవసరం మనంపై ఉంది. ప్రకృతి మనకు అందించే అనేక సేవలలో వాగులు ఉంటున్నాయి. అవి పల్లెలు, పట్టణాలకు ముఖ్యమైనగా ఉన్నాయి. వాగులు వర్షపాతాన్ని భూగర్భంలోకి చొచ్చుకుని వెళ్లేందుకు సహాయపడతాయి. ఇది భూగర్భ జలాలు సరిగ్గా పునరుత్తేజం అయ్యేలా చేస్తుంది. తద్వారా నీటి నిల్వలు పెరుగుతాయి. అలాంటి వాగులు తుమ్మ, తుంగ, గడ్డితో పూర్తిగా నిండిపోతే మరి నీటి పారుదల ఎలా సాధ్యమవుతుంది? ప్రస్తుతం ఇలాంటి సమస్యే చిలకలూరిపేట ప్రజలు ఎదుర్కొంటున్నారు.

వాగులో ఏపుగా తుమ్మ, తుంగ, గడ్డి

ఒంగోలు బ్రిడ్జి నుంచి పసుమర్రు బ్రిడ్జి వరకు వాగులో తుమ్మ, తుంగ, గడ్డితో పూర్తిగా నిండిపోయింది. ఈ వాగును చూసినవారు ఇదేదో తోట అనుకునేలా సాక్షాత్కరిస్తోంది. ఓగేరు వాగు పసుమర్రు బ్రిడ్జి వద్ద నుంచి గొట్టిపాడు మీదుగా పెదనందిపాడు వరకు సుమారుగా 28 కి.మీ. దాదాపు ఇదే పరిస్థితి. జీవనోపాధి కోసం చేపలు పట్టుకుందామని వాగులో దిగి పట్టు దొరకక మట్టిలో కురుకుని ఊపిరాడక చనిపోయిన వారి కొందరైతే, ఈతకని దిగి లోతు తెలియక చనిపోయిన వారి మరికొందరు ఉన్నారు. ప్రస్తుతం తుంగ, గరేప, తామర తదితర వాటితో ఓగేరు వాగుకి ఇరువైపులా ఒంగోలు బ్రిడ్జి వద్ద నుంచి పసుమర్రు బ్రిడ్జి వరకు పూర్తిగా పెరిగి ఆకులతో రెండు పక్కల కరకట్టల వరకు వ్యాప్తి చెంది ఉన్నాయి. అదే మాదిరి పసుమర్రు బ్రిడ్జి నుంచి పెదనంది పాడు బ్రిడ్జి వరకు వాగులో తుమ్మ చెట్లు, ఇతర పిచ్చి మొక్కలతో అసలు వాగు నీరు కాన రానంతగా పెరిగాయి. ఈ రెండు ప్రాంతాల్లో పట్టణ, పల్లెవాసులు చేపలు పట్టుట, ఈతకు దిగటంలాంటివి అప్పుడప్పుడు చేస్తుంటారు. ఇలా చేసి విద్యార్థులు, చేపలు పట్టే వారు అనేక మంది దిగి పొరపాటున ప్రాణాలు పో గొట్టుకున్న సందర్భాలున్నాయి. అయిన పారిశుధ్య అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గత రెండు సంవత్సరాల నుంచి వర్షాలు పెద్దగా లేక పోవడం వల్ల తుమ్మ చెట్లు, తామర ఆకులు ఏపుగా పెరిగిపోయాయి. వర్షం రాకడ.. ప్రాణం పోకడ తెలీదనే సామెతల కొద్దీ గంటల్లోనే ఇటీవల కేరళ రాష్ట్రంలో వాయ్‌నాడ్ ఘటన గుర్తుకుతెచ్చు కోవాల్సి ఉంది.

ఆక్రమణకు కరకట్టలు

వెలుస్తున్న ఇళ్లు, షాపులు

గతంలో చిలకలూరిపేటనుంచి పసుమర్రు మీదుగా చీరాల పోవాలంటే ఇదే ప్రధాన రహదారి. అప్పట్లో ఈ బ్రిడ్జి సౌకర్యవంతంగా ఉండేది. ఆ తూములకు చెత్త, చెదారం అడ్డుపడి నీరు వెనక్కి వెళ్లి ఒంగోలు బ్రిడ్జిని తన్నేవి. అంతేకాకుండా తుఫాన్లు, భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా ఆ నీరు రాగన్నపాలెం, గుండయ్యాతోట, కోమరివల్లిపాడు ఇలా కొన్ని కాలనీలు మునిగిపోయేవి. దీంతో చిలకలూరిపేట నుంచి పెదనందిపాడు వరకు 32 కిలో మీటర్లు వాగుకి ఇరువైపులా కరకట్టలను నిర్మించారు. అయితే ప్రస్తుతం ఆ కరకట్టలు ఆక్రమణకు గురై ఇళ్లు, దుకాణాలు, ప్రార్థన మందిరాలు, కళ్యాణ మండపాలు వెలసాయి. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ మొదలైంది. ఒంగోలు బ్రిడ్జి నుంచి పెదనందిపాడు బ్రిడ్జి వరకు ఇదే వాగు మీద సుమారుగా ఏడెనిమిది ఇరిగేషన్లు పనిచేస్తున్నాయి. వాటికి కూడా సక్రమంగా నీరందాల్సి ఉంది. కాబట్టి ఇప్పటికైనా వాగులను డ్రెయినేజి శాఖాధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తుమ్మ, తుంగ, గడ్డితో నిండిపోయిన వాగు



ఓగేరు వాగు నుండి పెదనందిపాడు వరకు ఏపుగా పెరిగిన పొదలు

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి-విజయపురిసౌత్



విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆర్అండ్‌బి చీఫ్ ఇంజినీర్, నాగార్జున సాగర్ ఏపీఆర్‌జేసీ పూర్వవిద్యార్థి నయీముల్లా అన్నారు. 1979-81 బ్యాచ్‌కు చెందిన నయీముల్లా ఆదివారం స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో సమావేశమయ్యారు. ముందుగా కళాశాల తరగతి గదులు, వసతి గహాన్ని పరిశీలించారు. కళాశాల ప్రధాన ద్వారం నుంచి హాస్టల్ భవనాల వరకు ఉన్న సుమారు 250 మీటర్ల మట్టి రోడ్డును తన సొంత నిధులతో తారురోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యాభ్యాసంతో పాటు తన జీవితంలో జరిగిన ఒడిదుడుకులను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరోజిని, జిల్లా ఇంజినీరింగ్ ఆఫీసర్ ఆర్.రాజా నాయక్, అధ్యాపకులు లింగేశ్వరావు, రత్న బాబు, సుబ్బారెడ్డి, చంద్రశేకర్, పూర్వ విద్యార్థి రమేష్ నాయుడు పాల్గొన్నారు.



క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని రెడ్డినగర్ డీవీఆర్ స్టేడియంలో నిర్వహించిన స్టార్స్‌క్రికెట్ టోర్నమెంట్ ముగింపు మ్యాచ్‌కు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కుమారుడు డాక్టర్ ఆదిత్య హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడాస్ఫూర్తి అత్యంత అవసరమన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం క్రీడా స్ఫూర్తి చాలా వరకు తగ్గిపోతోందని, శారీరక మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరం అన్నారు. క్రీడల ద్వారానే ఆరోగ్యంతో పాటుగా సమాజం పోకడలను అర్థం చేసుకునే వెసులుబాటు, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని డా. ఆదిత్య పేర్కొన్నారు.ఈ మేరకు క్రీడాకారులందరికీ శుభాకంక్షలు తెలియజేసి బహుమతులు అందించారు.ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు డాక్టర్ చదలవాడ ఆదిత్య పేర్కొన్నారు.

నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపకులు జి.వి.మాధవ రావు ఆధ్వర్యంలో కొత్తపేటలోని వారి కార్యాలయంలో పేద బ్రాహ్మణులకు బియ్యం నూతన వస్త్రములను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘానికి సుదీర్ఘకాలం సహాయం అందించిన దాతలు దివంగతులు చింతలపూడి సుబ్బారావు, అక్కిరాజు శశికళకి రెండు నిముషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం .ఈ నెలలో దాతలు అయిన చింతలచెర్వు రాఘవేంద్రరావు, ఎస్ఎస్‌వి.మల్లికార్జున శాస్త్రీ, అన్నాప్రగడ వెంకటేశ్వరరావు, శ్రీనివాసుని శ్రవణ్ కుమార్, ధూళిపాళ్ళ నాగేశ్వరావు, అంబడి పూడి శ్రీనివాసశాస్త్రి, అన్నదానం సుబ్రహ్మణ్యం, పిల్లుట్ల కమల కుమారి, చింతకుంట శంకరరావుల సహాయ సహాకార ములతో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రముల వితరణ చేశారు.

రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శిగా వెంకట కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-వినుకొండ



ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర యువజన సంఘం కార్యదర్శి(సెక్రటరీ)గా వినుకొండ పట్టణానికి చెందిన మండవ వెంకట కిరణ్ కుమార్ నియమితులయ్యారు. ఆయన నియామకం పట్ల పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ తనమీద నమ్మకంతో ఈ పదవిలో నియమించిన ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కండె నాగ రాజేష్‌కు హదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యదర్శిగా ఆర్యవైశ్యుల అందరికీ అందుబాటులో ఉంటూ యువజన సంఘాన్ని ప్రతిష్టం చేస్తూ ఎవరికి ఎటువంటి అవసరం వచ్చిన తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. ఈ పదవి తనపై ఇంకా బాధ్యత పెంచిందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల ప్రతినిధులు కిరణ్‌కు అభినందనలు తెలియజేశారు.

జనసేన కార్యకర్తకు సహాయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని పొడపాడు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త తోట వీరయ్యకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం ఆ పార్టీ నాయకులు ఆదివారం అందించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు ఈ పంపిణీ కార్యక్రమంలో సూదా సాంబశివరావు, జిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబెర్ శాఖమూరి శ్రీనివాస్, పెదకూరపాడు జనసేన మండల అధ్యక్షుడు మల్లెల వెంకట చలపతిరావు, ఉపాధ్యక్షులు కట్టెపోగు వీరబ్రహ్మం, కార్యదర్శి కందుల లక్ష్మికాంత్,గ్రామ అధ్యక్షుడు పమిడిపాటి రవి మరియు జనసైనికులు పాల్గొన్నారు.



నవంబర్ నాటికి మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్

- నిర్వీర్యమైన రక్షితనీటి పథకాన్ని సరిదిద్దుతాం
- అండర్ గ్రౌండ్ డ్రైయినేజి పనులపైనా దృష్టి సారిస్తాం : మంత్రి మనోహర్

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని నిలిచిపోయిన మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ పనులను తక్షణమే ప్రారంభించి రెండు నెలల్లో ప్రజలకు అంకితం చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. పట్టణ శివారు పూలే కాలనీలోని ట్రీట్‌మెంట్ ప్లాంటును ఆదివారం ఆయన అధికార బృందంతో కలిసి పరిశీలించారు. తదుపరి పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్, మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ప్రజల భవిష్యత్ అవసరాల దృష్ట్యా పూలే కాలనీ శివారులో కేటాయించిన ఆరు ఎకరాల భూమిలో టిడ్కో గృహ నిర్మాణం, పూలే కాలనీకి వినియోగించటం జరిగిందన్నారు. అలాగే, అదే ప్రాంతంలో అమృత్ పథకం కింద రూ.28 కోట్ల అంచనా వ్యయంతో మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ ఏర్పాటు ప్రారంభించామని, ఈ ప్లాంట్ ద్వారా రోజుకు పది మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధీకరించవచ్చన్నారు. ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు దాదాపు రూ.14కోట్లు వెచ్చించిన తదుపరి నిలిచిపోయాయన్నారు. తక్షణమే ఆ పనులను ప్రారంభించి రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. నవంబర్ ఒకటి నాటికి అందబాటులోకి తెచ్చి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రవహిస్తున్న మురుగునీటిని సీవేజ్ ప్లాంట్‌లో ఎలాంటి హాని లేకుండా శాస్త్రీయంగా శుభ్రపరచి రైతులకు సాగునీటి అవసరాలకు అందించటం జరగుతుందన్నారు. పట్టణంలో రక్షిత మంచినీటి పథకం నిర్వీర్య మైందని, నాలుగైదు వార్డుల్లో పైప్‌లైన్ ఉండి కూడా తాగునీరు అందని పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితిని కూడా చక్కదిద్దాల్సి ఉందన్నారు. పట్టణంలో మరో రెండు ప్రాంతాల్లోనూ మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్లు ఏర్పాటు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ కూడా అవసరమని, ఆ పనులపై కూడా వారంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కమిషనర్ బి.శేషన్న, డీఈ కె.నాగభూషణం, ఓఎస్డి ఏసురత్నం, పలువురు అధికారులు పాల్గొన్నారు.


మ్యాప్ పరిశీలిస్తున్న మనోహర్


సిఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న టిడిపి నాయకులు

15వ వార్డులో సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-మంగళగిరి

అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయనిధికి మంగళగిరి పట్టణం 15వ వార్డు చెందిన వెలగపాటి విక్టోరియా దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.50,000 చెక్కును, టిడిపి నాయకులు ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు విక్టోరియా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పి ప్రేమ్ కుమార్, పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ కార్యదర్శి కొదమల సురేష్, మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి వెలగపాటి విలియం తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ లో పాల్గొన్న రోటరీ క్లబ్ బృందం

రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం మెంబర్‌షిప్ ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి

రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్ లో నిర్వహించారు. సమావేశంలో క్లబ్ తరపున ఆగస్టులో నిర్వ హించాల్సిన కార్యక్రమాలపై సమీ క్షించారు. రక్తదాన శిబిరం నిర్వ హణ, 21న పేదలకు తోపుడుబండ్లు పంపిణీ, డాక్టర్ రవీంద్ర నాథ్ ఆధ్వర్యంలో డెంటల్ క్యాంపు, డాక్టర్ జీవనలత ఆధ్వ ర్యంలో హైస్కూల్ బాలికలకు ఆరోగ్యం పై అవగాహన, ప్రభుత్వ వైద్య శాలలో సిమెంట్ బెంచ్ లు ఏర్పాటు చేయటం వంటి అం శాలపై చర్చించారు. అనంతరరం గౌతమ్ గ్రాండ్ హోటల్ నుండి రైల్వే స్టేషన్ వరకు మెంబర్‌షిప్ ర్యాలీ నిర్వ హిం చారు. రోటరీ మెం బర్‌గా చేరిన ఆలపాటి వెంకట్రామయ్య, తాని గుండాల రాజశేఖం రెడ్డిని రోటరీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి డి.మురళీ కృష్ణ, మెంబర్‌షిప్ చైర్ ఈదర వెంకట పూర్ణ చంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థి దశలోనే మన దేశ గత చరిత్ర, వర్తమాన పరిస్థితులను తెలియజేస్తూ వారిలో దేశం పట్ల భక్తి, విశ్వాసం కలిగేలా తల్లిదండ్రులు, పాఠశాలలు బోధించాలని ప్రజాలోచన వేదిక అధ్యక్షులు మేడూరి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.గన్నే వాసు ఆర్ట్స్, శ్రీ విశ్వ కర్మ పీఠం, శంబయాచార్య లలిత కళా పురస్కారం సంయుక్త ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని స్థానిక అరండల్‌పేట దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణంలో విద్యార్థులకు దేశభక్తి గీతాలు, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీలక్ష్మీబాయి, ఏక పాత్రాభినయాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గన్నే వాసు ఆర్ట్స్ వ్యవస్థాపకులు వాసుదేవరావు మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, నటన, సాంస్కృతిక అంశాలతో పాటు దేశభక్తి ప్రేరేపిత లఘు చిత్రాలు నిర్మిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యోగి మహేశ్వరానంద స్వామీజీ, వి.హనుమంతరావు, కె.వి మల్లికార్జున ఆచారి, మమత, సుకన్య తదితరులు పాల్గొన్నారు.


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్, తదితరులు

బదిలీపై వెళుతున్న తహశీల్దార్‌కు వీడ్కోలు

ప్రజాశక్తి-ఫిరంగిపురం

ఫిరంగిపురం తహశీల్దారుగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.నాంచారయ్యను బాపట్ల జిల్లాకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆదివారం కార్యాలయం సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు ఆత్మీయ వీడుకోలు పలికారు. ఇదిలా ఉండగా, డిప్యూటీ తహశీల్దార్ గా పనిచేస్తున్న కె.రాజా రమేష్ మోహన్ ఫుల్ ఎడిషనల్ చార్జ్ పై తహశీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు వెలువడ్డాయి.



పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు జాగరూకతతో వ్యవహరించండి

ఎపి పోలీస్ శాఖ సూచన

ప్రజాశక్తి - తుళ్లూరు

విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు జాగరూకతతో వ్యవహరించాలని ఎపి పోలీస్ శాఖ సూచించింది.

- విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం పాఠశాల నుండి వచ్చిన తర్వాత బయట తిరగనీయరాదు.
- మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు, వాహనాలు సీజ్ చేయబడతాయి.
- పాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణా రహితంగా ప్రవర్తించినా,ఆడపిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించినా అటువంటి కంప్లైంట్స్ స్కూల్ యాజమాన్యం నుండి వస్తే కనుక టిసి ఇచ్చి ఇంటికి పంపివేయబడతారు. మరే ఇతర స్కూల్లోనూ జాయిన్ చేసుకోని విధంగా చర్యలు తీసుకోబడతాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతటి వారైనా అందరికీ ఒకే విధంగా చర్యలు తీసుకోబడతాయి.
- విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారు,ఎలాంటి అలవాట్లు చేసుకుంటున్నారు, దుర్వ్యసనాలకు పాల్పడుతున్నారా.. అనే విషయాలపై పూర్తి స్పృహ కలిగి ఉండాలి. ఎప్పటికప్పుడు వారి కదలికలపై దృష్టి సారించాలి.
- పిల్లలకు ఫోన్ లు ఇవ్వడం, పర్సనల్ కంప్యూటర్లు ఇవ్వడం చేయరాదు. ఇవ్వాల్సిన పరిస్థితులు వస్తే వాటి వినియోగం పై పూర్తి నిఘా ఉంచాలి. పిల్లలు ధరించే దుస్తులు, హెయిర్ కటింగ్ పై శ్రద్ధ వహించాలి. పాశ్చాత్య సంస్కృతులకు దూరంగా ఉంచాలి.
- పిల్లలు చేస్తున్న స్నేహాలపై, స్నేహితుల అలవాట్లపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- శారీరకశ్రమ అందించే క్రీడలకు ప్రోత్సహించి, చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- మీ పిల్లలు చెడు వ్యసనాలకు (తాగుడు, మత్తు మందులు ఇతరత్రా...) అలవాటు పడకుండా చూడవలసిన బాధ్యత తల్లిదండ్రులదే... జాగ్రత్తలు వహించండి... మీ పిల్లలను ఒక కంట కనిపెట్టండి.
- పిల్లలను ప్రేమగా చూసుకోవడం మంచిదే. కానీ అతి ప్రేమతో వారిని మొండి వారిగా తయారు చేయడం వల్ల సమస్యలు ఎదురవుతాయి,. మొక్కై వంగనిది మానై వంగదని తల్లిదండ్రులు గమనించాలి.

రూరల్ సిఐగా బెల్లం శ్రీనివాసరావు బాధ్యతలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్



తెనాలి తాలూకా సిఐ గా బెల్లం శ్రీనివాసరావు ఆది వారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు వెయిటింగ్ లో ఉన్నట్లు సమా చారం. గతంలో తాను తెనాలిలో పనిచేసిన అనుభవం ఉందని సిఐ శ్రీనివాసరావు తెలిపారు. ప్రజా సమస్యలు పరి ష్కారంలో భాగంగా ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని కొన సాగిస్తామని సిఐ అన్నారు. గంజాయి రహిత నియోజక వర్గమే లక్ష్యంగా పోలీస్ వ్యవస్థను ముందుకు తీసుకెళ్తా మన్నారు. శాంతి భద్రతల సంరక్షణకు తన వంతు సహా యాన్ని అందిస్తామన్నారు. పోలీసులకు సహకరించాలని రూరల్, పట్టణ ప్రజలను కోరారు.

తాడికొండ సిఐగా కె.వాసు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-తాడికొండ



మండల నూతన సిఐ గా కె.వాసు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు కృషి చేస్తానని అన్నారు, ప్రజలందరూ సోదర భావంతో కలిసి ఉండాలని సూచించారు. తాడికొండ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు.



శివాలయంలో అన్నదానం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల అమావాస్య తర్వాత జరిగే అన్నదాన కార్యక్రమం ఆదివారం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి మాట్లాడుతూ భక్తుల సహకారంతో ప్రతి నెలలో అమావాస్య తర్వాత వచ్చే ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల కోటేశ్వరరావు, పురోహితులు టి.శ్యామ సుందర శాస్త్రి, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారాయణ, కాగ్గా శ్రీను, జూట్రు ఏడుకొండలు, అన్నపరెడ్డి రామకష్ణారెడ్డి, నాగరాజు, వాసు, గాయత్రి పరివార్ ప్రతినిధి పేర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బైపాస్‌రోడ్డులోని లాడ్జీలు, హోటళ్లు తాడేపల్లి ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గతంలో ఈ ప్రాంతంలో కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేపథ్యంలో కొంత మందిపై కేసులు నమోదు చేశారు. మరికొంత మందిని వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. విఐపి జోన్ కావడంతో నిబంధనలకు లోబడి వ్యాపారాలు నిర్వహించుకోవాలని రమేష్ లాడ్జీలు, హోటల్ యజమానులకు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



సెమీస్ దశకు సాఫ్ట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలోని గుడ్ షెపర్డ్ పాఠశాల ఆవరణలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం సెమీఫైనల్ దశకు చేరాయి. పురుషుల విభాగంలో 6 జట్లు, మహిళా విభాగం 6 జట్లు పోటీపడ్డాయి. మహిళా విభాగంలో విజయనగరం గుంటూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల జట్లు విజయం సాధించగా పురుషుల విభాగంలో శ్రీకాకుళం, కృష్ణ, విజయనగరం జట్లు గెలుపొందాయి. పోటీలను ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ నరసింహారెడ్డి, గుడ్ షెఫర్డ్ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఇన్నారెడ్డి, పీడీలు చిరంజీవి, సురేష్, రాధాకృష్ణ, సుబ్బారావు పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా నేటితో పోటీలు ముగియనున్నాయి.

నేడు క్విట్ ఇండియా అమరవీరుల సంస్మరణ సభ

ప్రజాశక్తి-తెనాలి

క్విట్ ఇండియా ఉద్యమ అమరవీరుల సంస్మరణ సభ సోమవారం ఉదయం 8 గంటలకు పాతబస్టాండ్ వద్ద రణరంగ చౌక్‌లోని స్తూపాలవద్ద నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న ఆదివారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ ఎం.నాగలక్ష్మి, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పాల్గొని అమరవీరుల స్తూపాల వద్ద నివాళులర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులను, అమరవీరుల కుటుంబ సభ్యులను, వివిధరంగాల్లో ప్రతిభావంతులను సత్కరించనున్నట్లు తెలిపారు.



టిఎల్‌ఎంను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

ఉర్దూ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) ఉర్దూ మాధ్యమంలో తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను అసోసియేషన్ నాయకులతో కలిసి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉర్దూ పాఠశాలలు, ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యలపై అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. టీచర్ల పని సర్దుబాటు ప్రక్రియలో భాగంగా మిగులు ఉర్దూ టీచర్లను ఉర్దూ అప్పర్ ప్రైమరీ, ఉర్దూ హైస్కూల్స్‌లో మాత్రమే సర్దుబాటు చేయాలని కోరారు. పని సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఉర్దూ పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులుండే విధంగా చూడాలని, హైస్కూల్ ప్లస్‌లో ఉర్దూ పిజిటిలను నియమించాలని, అన్ని జిల్లాల్లో ఉర్దూ డిఐ పోస్టులను అర్హులైన వారితో భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రూటా రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎస్.ఇమాంబాషా, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎమ్‌డి.గయాజ్, రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ అబ్దుల్ ముజీబ్ షాహి, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అధ్యక్షులు అబ్దుల్ షజీర్, మహబూబ్ సుభాని, ఇమాముద్దీన్ ఖాద్రీ పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌గా గుంటూరు

ప్రజాశక్తి-గుంటూరు : రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ ఓవరల్ ఛాంపియన్‌గా గుంటూరు జిల్లా జట్టు నిలిచినట్లు గుంటూరు జిల్లా రోప్ స్కిప్పింగ్ సెక్రెటరీ పి.తిరుపతిరావు తెలిపారు. కర్నూలు జిల్లా, గార్గేయపురంలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించిన 7వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్‌లో గుంటూరు జిల్లా బృందం ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. విద్యార్థులను కోచ్ ఇమ్మానియేల్ రాజు, టీం మేనేజర్ వెంకటేశ్వర్లు అభినందించారు.







భళారే విచిత్రం

- చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులు
- బహుమతి ప్రదానోత్సవంలో నృత్య ప్రదర్శనలతో సందడి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పిల్లలకు సెల్‌ఫోన్‌లను దూరంగా పెట్టి పుస్తకాలు పట్టించాలని వక్తల హితవు



ప్రజాశక్తి-తాడేపల్లి



మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో తాడేపల్లి ఆశ్రమం రోడ్డులోని అమరావతి ఐకాన్‌లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. వివిధ పాఠశాలల నుంచి వందలాది మంది విద్యార్థినీ విద్యార్థులు నాలుగేళ్ల వయసు నుంచి పదిహేనేళ్ల వయసు గల బాలబాలికలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని భళారే బాలలు అనిపించారు. దీంతో అమరావతి ఐకాన్‌లో పండుగ వాతావరణం నెలకొంది. విజయవాడ ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, షార్ట్ ఫిలిమ్ అసోసియేషన్ బాధ్యులు డివిఎస్ రాజు పోటీలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అమరావతి ఐకాన్‌లో డ్యాన్స్ మాస్టర్ చందు ఆధ్వర్యంలో బాలబాలికలు నేర్చుకున్న వివిధ రకాల డ్యాన్సులు, నృత ప్రదర్శనలు ప్రదర్శించారు. కాజ నుంచి బాలల సంఘం బాధ్యులు సింహాద్రి సుమ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్య రూపకాలు సభికులను అలరించాయి. వివిధ అపార్టుమెంట్‌ల వాసులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పెద్దలు రెండు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమం ఆసాంతం తిలకించారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు జగన్ అభ్యుదయ గీతాలు ఆలపించారు.

కల్మషం లేని మనసులు... భావిభారతం మీదే..

ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభ మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. రంగిశెట్టి ఫౌండేషన్ చైర్మన్ రంగిశెట్టి రమేష్ మాట్లాడుతూ బాలబాలికలు కల్మషం లేని మనసులు... కల్లాకపటం లేని నిర్ణేతలు... భావిభారతం మీదేనని.. అని అన్నారు. పిల్లల్లో సృజనాత్మకతను పెంచడానికి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాలోత్సవం ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. పిల్లలను ప్రోత్సహించి వారి ప్రతిభా పాఠవాలను, జీవితంలో పోటీతత్వాన్ని అలవర్చడానికి తీసుకొచ్చిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. బాల్యంలో తాము గడిపిన జీవితాన్ని, ఆడిన ఆటలను





బహుమతులు అందుకుంటున్న బాలలు

గుర్తు చేసుకున్నారు. నేడు టెక్నాలజీ పెరిగిన తరువాత సెల్‌ఫోన్ వచ్చి బాలబాలికలకు ఆటలను దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చందమామ, బాలమిత్ర, పంచతంత్ర కథలు లాంటి పుస్తకాలు మాయమైపోయామనని ఆందోళన వెలిబుచ్చారు. పిల్లలకు పౌష్టికరమైన ఆర్గానిక్స్‌తో కూడిన ఆహార పదార్థాలను పెట్టాలని ఉద్బోధించారు. కొన్ని వేల సంవత్సరాల క్రితం రాతి యుగంలో చిత్రలేఖనం గోడలపై వేసేవారని, ఈ రోజు అది అభివృద్ధి చెంది కళాత్మకంగా ప్రజల ముందుకు వచ్చిందని చెప్పారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం గౌరవాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలబాలికలోల సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ పోటీలు ఉపయోగపడతాయని చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు మాట్లాడుతూ బాలలు సెల్‌ఫోన్‌కు అడిట్ అవ్వకండా అభివృద్ధి పథంలో నడవడానికి, ఉన్నత స్థానానికి చేరుకోవడానికి చిత్రలేఖనం పోటీలు ఉపయోగపడతాయని చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో పోటీతత్వం పెరగడానికి ఈ పోటీలు దోహదం చేస్తాయన్నారు. బాలోత్సవం రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం గల భారతదేశానికి ఏకతాటిపై ఉంచడమే పోటీల లక్ష్యమన్నారు. బాలబాలికలు చదువుతో పాటు చుట్టుపక్కల జరుగుతున్న అనేక సమాజ పరిణామాలను కూడా గమనించాలని తెలిపారు. బాలల్లో శక్తియుక్తులను వెలికితీయడమే బాలోత్సవం లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వంద చోట్ల బాలోత్సవాలు నిర్వహించడానికి ఈ సంవత్సరం ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఈ సందర్భంగా డ్యాన్స్ మాస్టర్ చందు ఆధ్వర్యంలో బాలబాలికల స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. భరతనాట్యం, కూచిపూడి, క్లాసికల్ డ్యాన్సులు అలరించాయి. కాజ నుండి బాలల సంఘం బాధ్యులు సింహాద్రి సుమ ఆధ్వర్యంలో ప్రదర్శించిన మూడు ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలిచాయి. వీటిలో ఎక్కడ వచ్చిందమ్మ స్త్రీ జాతికి స్వాతంత్ర్యం నృత్య రూపకం పలువురి అభినందనలు అందుకుంది. ముందుగా వేదిక మీదకు అమరావతి ఐకాన్ ఎం.సంధ్యారాణి వక్తలను ఆహ్వానించారు. ఇ.రాజశేఖర్, విక్రమ్, జి.రమ్య, వై.అచ్యుతరావు, పి.విజయ, నాగరాజు, వెంకటరావు, జి.సుమ, వై.సౌజన్య, ప్రకాష్ పాల్గొన్నారు.

సీఆర్పీల సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్తా

ఫెడరేషన్ రాష్ట్రస్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు - జిఒ 65ను రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-మంగళగిరి



సమగ్ర శిక్ష, పాఠశాల శాఖ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సిఆర్‌పి)ల సమస్యలను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఎస్‌ఎల్‌ఎం చైతన్య స్కూల్ అవరణలో సిఆర్‌పిల ఫెడరేషన్ రాష్ట్రస్థాయి సమావేశం కార్యదర్శి కె.గురువులు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఆర్పీలను విద్యాశాఖలో విలీనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో జీవో 65కు వ్యతిరేకంగా 22 రోజులు సమ్మె చేశారని, వాటికీ జీతాలు మంజూరు చేయాలనే అంశాన్ని స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఉద్యోగ భద్రత హెచ్‌ఆర్ పాలసీ, జీవో 65 రద్దు, తదితర అంశాలను మంత్రి లోకేష్‌తో సమావేశమై చర్చిస్తామని హామీనిచ్చారు. టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ సీఆర్పీల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. సీఆర్పీల డిమాండ్లను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తానని చెప్పారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఆర్పీ జాబ్ చార్ట్ అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ నాయకులు పి.కిషోర్, కాపునాడు టీచర్స్ ఫెడరేషన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జివిల్వి మాధవరావు, యు.సాయి కుమార్, రామాంజనేయరెడ్డి, బి.మధు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సీఆర్పీలు పాల్గొన్నారు.